క్లుప్తంగా

శీతల గంగమ్మకు పూజలు



సిద్దవటం : మండలంలోని మాధవరం–1 పంచాయతీ పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారి 22వ జాతర మహోత్సవ సందర్భంగా భక్తులు బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పాలాభిషేకం, అలంకరణ, పొంగళ్లు, శక్తి పూజ వంటి కార్యక్రమాలు జరిపారు. ఆలయ అర్చకులు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. రాత్రి అమ్మవారి కథ, అమ్మవారి ప్రతిమను ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందని కమిటీ వారు తెలిపారు.

దేవపట్ల పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల పీహెచ్‌సీని బుధవారం జిల్లా వైద్యాధికారి లక్ష్మీనరసయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది సమయపాలనపై ఆరాతీశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు.

వైఎస్ జగన్‌ను కలిసిన మండల కన్వీనర్



పుల్లంపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సయ్యద్ ముస్తాక్ బుధవారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. మండలంలోని పలు సమస్యలపై ముస్తాక్ జగన్‌మోహన్ రెడ్డితో చర్చించారు. ఇందుకు మాజీ ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో రిజ్వాన్, సయ్యద్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్‌ఆర్‌సీపీ మండల స్థాయి సమావేశం

సుండుపల్లె : వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి సమీక్షా సమావేశాన్ని మండల కేంద్రంలోని ఆరెమ్మ దేవాలయం దగ్గర గురువారం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వైఎస్‌ఆర్‌సీపీ కుటుంబసభ్యులు, జెడ్పీటీసీ, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ మండల కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాల్సిందిగా ఆయన తెలియజేశారు.

ఆరోగ్య విషయాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మనీషా

వీరబల్లి : మండలంలోని ఓదివీడు పంచాయతీలో ఎర్రంరాజుగారిపల్లి, హరిజనవాడ డ్వాక్రా మహిళలకు బుధవారం ఆరోగ్య విషయాలపై ప్రభుత్వ వైద్యాధికారిణి మనీషా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆమె వైద్య సిబ్బందితో 104 వాహనంలో వెళ్లి అక్కడ ఉన్న ప్రజలకు వైద్య చికిత్సలు నిర్వహించారు. అనంతరం అక్కడ జరుగుతున్న డ్వాక్రా మహిళల సమావేశంలో ఆమె పాల్గొని ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. వివిధ రకాల జబ్బుల గురించి వివరించారు. ముఖ్యంగా రక్తహీనత గురించి, బీపీ, షుగర్ వంటి జబ్బులు గురించి వివరించి మాత్రలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



నాజియా

గాలివీడు : యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ ఉర్దూ విభాగంలో పరిశోధనా విద్యార్థి నాజియాకు పీహెచ్‌డీలో డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆమె ఇక్కడి విలేకరులకు తెలిపారు. గాలివీడు పట్టణం పెద్దూరుకు చెందిన నాజియా అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.అమానుల్లా పర్యవేక్షణలో దక్షిణ భారత మహిళా సాహిత్యంలో హాస్యం–వ్యంగ్యం అనే అంశంపై సిద్ధాంత గ్రంథం సమర్పించినట్టు ఆమె తెలియజేశారు. కాగా ఎక్స్‌ట్రనల్ ఎగ్జామినర్‌గా డాక్టర్ నౌషాద్ హుస్సేన్ వ్యవహరించారు. డాక్టరేట్‌ను పొందిన నాజియాను పలువురు స్థానికులు ప్రశంసించగా, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాబు వెన్నుపోటును ప్రతి ఇంటికి వివరిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- ఏడాది పాలనలో అప్పులు తప్ప అభివృద్ధి, సంక్షేమం లేదు
- పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు
- మండల స్థాయి సమావేశంలో కొరముట్ల శ్రీనివాసులు, కొండూరు అజయ్‌రెడ్డి

పెనగలూరు : ప్రతి కార్యకర్త వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటూ ఒక పిడికిలిలా పనిచేయాలని రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం పెనగలూరులోని కల్యాణ మండపంలో మండలస్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీ కోసం పిడికిలి బిగించి ఇప్పటి నుండే పని చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని చెప్పారు. సీఎం చంద్రబాబు మాటలు చెప్పడమే తప్ప పనులు మాత్రం చేయరన్నారు. అదే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి చేసిన హామీలను నెరవేర్చడంలో ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. ఏడాది పాలనలో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన అప్పుల కంటే ప్రస్తుత కూటమి పాలనలో సీఎం చంద్రబాబు చేసిన అప్పు అప్పటికంటే మూడు రెట్లు అధికం అన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రతి ఒక్కరూ కష్టపడి వార్డు మెంబర్ నుంచి ఎంపీ స్థాయి వరకు గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. అందరూ కలసికట్టుగా నడిస్తే ఏ ఎన్నికల్లోనైనా విజయం తథ్యమని తెలియజేశారు. అధికారంలోకి రాక ముందు హామీలతో ప్రజలను మభ్యపెట్టిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక హామీల అమలు చేయకుండా ప్రజలను పక్కదారి పట్టిస్తున్నాడని మండిపడ్డారు.

మహిళలకు భద్రత కరువు

రాష్ట్రంలో అరాచకాలు నానాటికీ పెరిగిపోతున్నాయని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళలకు ఏమైనా జరిగితే ఎంతటి వారైనా వదిలిపెట్టనని ప్రగల్భాలు పలికిన ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్న ఎందుకు స్పందించడం లేదని వాపోయారు. చంద్రబాబు అసత్యపు వాగ్దానాలను వారు విపులంగా కార్యకర్తలకు వివరించారు. ఇప్పటికే చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారన్నారు. మామకు వెన్నుపోటు పొడిచిన నేతగా బాబు పేరు తెచ్చుకున్నారన్నారు.

కార్యకర్తలకు అన్ని విధాలా అండగా

వైఎస్సార్‌సీపీలో కష్టపడి పని చేసే నాయకులు, కార్యకర్తలకు సరైన గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల, కొండూరు అజయ్‌రెడ్డిలు స్పష్టం చేశారు. ఇప్పటికే కష్టపడేవారికి వివిధ కమిటీలలో స్థానం కల్పించామని చెప్పారు. అందరూ కష్టపడి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసుకుని వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుల ఆదేశానుసారం చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలను ప్రతి గడపకు తీసుకెళ్దామని పేర్కొన్నారు. పింఛన్‌లు తొలగించడం, రైతులను దగా చేయడం, విద్యను నిర్లక్ష్యం చేయడం, ఇసుకలో చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ మండల కన్వీనర్ కేతా చక్రపాణి, పెనగలూరు జెడ్పీటీసీ సభ్యులు ఉదయగిరి సుబ్బరాయుడు, ముదిరాజ్ సంఘం మాజీ డైరెక్టర్ల గుండ్లూరు ఈశ్వరయ్య, నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ యూత్ ప్రెసిడెంటు గుండ్లూరు శివకుమార్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వీరనారాయణ రెడ్డి, సుబ్బారెడ్డి, ఈటమాపురం శంకర్ రెడ్డి, ఎల్.శ్రీనివాసులు రెడ్డి, సుబ్బారెడ్డి, శివయ్య నాయుడు, బండి సానారెడ్డి, వెంకట్ రెడ్డి, నాగసుబ్బారెడ్డి, ఓబిలి ముస్లిం మైనార్టీ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు యాజమాన్య పద్ధతులపై శిక్షణ



రైతులకు జీవన ఎరువులు అందజేసిన అధికారులు

సిద్దవటం : మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో బుధవారం మామిడిలో కోతలు అయిన తరువాత రైతులు చేపట్టవలసి యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించామని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మామిడిలో జూన్, జూలై నెలలలో చేపట్టిన యాజమాన్యమే పూత, కాయ దశల్లో ఉపయోగపడుతుందని చెప్పారు. కొత్తగా మామిడి పంట పెట్టదలచిన రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించి, పరీక్షల ఫలితాల ఆధారంగా నాటుకోవాలని సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.మానస మాట్లాడుతూ కొమ్మ కత్తిరింపుల ఆవశ్యకత, కత్తిరింపులు చేసే విధానాలను, కలుపు యాజమాన్యం గురించి వివరించారు. రైతులు తప్పనిసరిగా సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన మొక్కలతోపాటు, నాణ్యమైన దిగుబడులను సాధించవచ్చునని అన్నారు. ఈ సమయంలో అధికంగా వచ్చే ఆకు జల్లెడ పురుగుల నియంత్రణ చర్యల గురించి విశదీకరిస్తూ సూక్ష్మ పోషక యాజమాన్యం ప్రాముఖ్యతను తెలియజేశారు. సేద్యపు విభాగపు శాస్త్రవేత్త డాక్టర్ కె.సాయిమహేశ్వరి మాట్లాడుతూ భూసారం, పంట ఆరోగ్యం పెరుగుదలతో జీవన ఎరువుల ప్రాముఖ్యతను వివరిస్తూ కూలంకుషంగా రైతులతో చర్చించారు. అనంతరం మామిడి రైతులకు జీవన ఎరువులు, జీవ నియంత్రికాలైన ట్రైకోడర్మ, సూడోమోనస్‌ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శివకుమార్, రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు సునీల్‌కుమార్, మామిడి రైతులు పాల్గొన్నారు.

ఆవులకు వ్యాధి నిరోధక టీకాలు

నందలూరు : రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ నిర్వహిస్తున్న వ్యాధి నివారణ కార్యక్రమాలలో అత్యంత ప్రమాదకరమైన లంపి స్కిన్ (ఆవులలో ముద్ద చర్మ) వ్యాధి నిరోధక టీకాలు నందలూరు పంచాయతీ ఈదరపల్లి గ్రామంలో ఆవులకు బుధవారం వేసినట్టు మండల పశువైద్యాధికారి మాధవీలత పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీకాలు వేయడం వల్ల ముఖ్యంగా ఆవులు వ్యాధి బారిన పడకుండా కాపాడవచ్చన్నారు. ఈ వ్యాధి 2 నుంచి 3 రోజుల పాటు తేలికపాటి జ్వరంతో మొదలై తర్వాత శరీరం అంతటా చర్మంపై గట్టి, గుండ్రని చర్మపు ముద్దలు (నాడ్యూల్స్) 2 – 5 సెం.మీ. వ్యాసం వరకు అభివృద్ధి చెందుతాయన్నారు. ముద్దలు చర్మంపై గుండ్రంగా, దృఢంగా ఉండి కొన్నిసార్లు కండరాల వరకు కూడా వ్యాపిస్తాయన్నారు. ఆరోగ్యవంతమైన పశువుల నుంచి జబ్బుపడిన లేదా సోకిన పశువులను తక్షణమే వేరు చేయాలన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో దోమలు, ఈగలు, పేలు సంఖ్యను తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. కావున పర్తి ఒక్క పాడి రైతులు ఆవులకు టీకాలు వేయించుకోవాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఏ సుదర్శన్‌రెడ్డి, ఏహెచ్‌ఏలు జాహ్నవి, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హైస్కూల్ సిబ్బంది

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో వేర్వేరు పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం సాయంత్రం ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వారిని శాలువా జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. బదిలీపై వెళ్లిన ఖాదర్‌బాషా, శిల్పి ఆనందాచారి, బి.రవిశంకర్‌రెడ్డి, తులసీ, స్వర్ణలత, రమణమ్మ, ప్రమీలా రాహేల్, ఆఫీస్ సబార్డినేట్ ఇర్ఫాన్‌లకు వీడ్కోలు పలికారు. అనంతరం వీరి స్థానంలో పాఠశాలకు విచ్చేసిన ఉపాధ్యాయులు గ్లోరీ కిరణ్ ఉజాల, రాజేంద్ర, గాయత్రీదేవి, డాక్టర్ శర్వాణీ, సుమలత, ఆఫీసు సబార్డినేట్ నాగలక్ష్మిలకు శాలువా కప్పి, పూలు పండ్లు ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమానికి విశ్రాంత ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ నాగేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేయగా గొంటుముక్కల వెంకటరమణ, నాగిశెట్టి లక్ష్మీనారాయణ, పి.విజకుమారి తదితరులు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ ప్రసంగించారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి



రైతులకు సూచనలిస్తున్న ఏఓ గౌతమి

గాలివీడు : మండలంలోని నూలివీడు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారిణి గౌతమి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీఆర్సీ కార్డ్స్, వేరుశనగ పంటలో పాటించాల్సన మేలైన యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు వివరించారు. అంతేగాక డ్రోన్ ఉపయోగాలు, అది ఎలా పనిచేస్తుందనేది ప్రత్యక్షంగా రైతులకు చూపించారు. అలాగే వర్షాభావ పరిస్థితుల్లో రైతులందరూ చిరు ధాన్యాలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ, ఏఈఓ, వీహెచ్‌ఏ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఫలితాలలో బిట్స్ విద్యార్థుల విజయకేతనం



సమీరా



సాజిదాసానా



తబసుమ్

రాయచోటి జగదాంబసెంటర్ : రామాపురం మండలం బండపల్లె వద్ద ఉన్న భాస్కర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ ఫలితాలలో విజయకేతనం ఎగురవేసినట్లు చైర్మన్ ఎం.భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ అండ్ సైన్స్ విభాగంలో 88 శాతం మార్కులతో సమీరా మొదటి ర్యాంకు సాధించగా సాజిదా 86.6 శాతంతో రెండవ ర్యాంకు, 80.7 శాతంతో సానా తబసుమ్ 80.5 శాతంతో మూడవ ర్యాంకు సాధించగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో సాయిదర్శిని 80.5 శాతంతో మొదటి ర్యాంకు, జాహ్నవి 79 శాతంతో రెండవ ర్యాంకు, వెంకటేష్ 78.5 శాతంతో మూడవ ర్యాంకు సాధించి యూనివర్శిటీ స్థాయిలో అగ్రగామిగా నిలిచారని తెలిపారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని అంకితభావంతో చదవడం వల్లే తమ కళాశాలకు అత్యుత్తమ ఫలితాలను పొందినట్లు తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎం.భాస్కర్‌తో పాటు ప్రిన్సిపల్ డా.ఏసీఎస్ రెడ్డి, ప్రొఫెసర్లు వెంకటరత్నం, సుమియా సుల్తానాలు అభినందించారు.

బ్యాంకు ఖాతాతో భరోసా

వీరబల్లి : బ్యాంకులో ఖాతా ఉంటే బహుళ ప్రయోజనాలు సమకూరుతాయని బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ రమాదేవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్‌డీకేఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ గ్రామస్థాయి జన సురక్ష పథకాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడమే తమ లక్ష్యమన్నారు. బ్యాంకు ఖాతా లేని వారు వెంటనే బ్యాంకు ఖాతా చేసుకోవాలన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలను క్షుణ్ణంగా వివరించారు. బ్యాంకు అందిస్తున్న సేవలను విద్యార్థులకు తెలియజేశారు. వృథా ఖర్చులు తగ్గించి విద్యార్థి దశ పొదుపు పాటించాలని సూచించారు. వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలు, సైబర్ క్రైమ్ పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది గీత, రమణ, లక్ష్మణ్, శ్రీను, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పెద్దివీడు హైస్కూల్‌కు బస్సు సర్వీసు



బస్సును ప్రారంభిస్తున్న డిపో ఇన్‌చార్జ్ మేనేజర్

వీరబల్లి : రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చొరవతో వీరబల్లి మండలం వంగిమళ్ల గ్రామం పెద్దహరిజనవాడ నుంచి పెద్దివీడు రెడ్డివారిపల్లి హైస్కూల్‌కు వెళ్లేందుకు విద్యార్థుల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేకంగా బస్సు సర్వీసును ఏర్పాటు చేశారు. బుధవారం రాయచోటి ఆర్టీసీ డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ మహేశ్వర్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ నాగేంద్ర నాయక్‌లు ఉపాధ్యాయులతో కలిసి బస్సు సర్వీసును ప్రారంభించారు. అనంతరం డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ మహేశ్వర్ రెడ్డిని విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అలానే గ్రామ ప్రజలు, పాఠశాల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



పశువులకు టీకాలు వేస్తున్న మాలకొండయ్య

లక్కిరెడ్డిపల్లి : సంకరజాతి పశువులకు తైలేరియా వ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్తగా టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ మాలకొండయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దిన్నెపాడు గ్రామం నరసింహరాజుగారిపల్లి, వడ్డిపల్లి గ్రామాలలో సంకరజాతి పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ ముఖ్యంగా తైలేరియా వ్యాధి అనగా పశువులకు పిడుదులు ఎక్కువగా వస్తాయని, దీంతో పశువులు పిడుదల వల్ల రక్తహీనత కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటాయన్నారు. దీని వలన అధిక జ్వరం, రక్తహీనత, లింప్ గ్రంధుల వల్ల పశువులు చనిపోతాయన్నారు. ప్రతి రైతుకు ఆర్థిక నష్టం కలగకుండా ఉండాలంటే పశువులకు కచ్చితంగా టీకాలు వేయించాలన్నారు.

మానవత సంస్థకు విరాళం

సుండుపల్లె : మానవత సేవా సంస్థకు ఏటిగడ్డ రాచపల్లికి చెందిన ఎం.యువరాజు వారి తండ్రి స్వర్గీయ ఎం.కృష్ణంరాజు జ్ఞాపకార్థం రూ.10 వేలు ఆర్థికసాయాన్ని సంస్థ చైర్మన్ మిన్నమ రెడ్డి గంగిరెడ్డికి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు రెడ్డయ్యరాజు, మండల కోశాధికారి నరసింహులు పాల్గొన్నారు.

ముగిసిన మధ్యవర్తిత్వపు వారోత్సవాలు



వన్‌కే వాక్‌లో జడ్జి ప్రవీణ్‌కుమార్, ఏఎస్పీ రామ్‌నాథ్

రాజంపేట : ఏపీ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మధ్యవర్తిత్వపు వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా 1కే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 16 వరకు మధ్యవర్తిత్వపు వారోత్సవాలు నిర్వహించుకున్నామన్నారు. తర్ఫీదు పొందిన మధ్యవర్తుల ద్వారా పలు కార్యక్రమాలు జరిపామన్నారు. కోర్టు ఆవరణలో పారా లీగల్ వలంటీర్ల ద్వారా, తర్ఫీదు పొందిన మధ్యవర్తుల ద్వారా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి టి.కేశవ, జూనియర్ సివిల్ జడ్జి రాజన్ ఉదయ ప్రకాశ్, రాజంపేట ఏఎస్పీ రామ్‌నాథ్ మనోజ్ హెగ్డే, రాజంపేట బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతునాయుడు, మధవర్తులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా రైతాంగాన్ని ఆదుకోండి



జిల్లా వ్యవసాయశాఖ అధికారికి వినతి పత్రాన్ని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

రాయచోటి టౌన్ : జిల్లాలో రైతాంగం దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, గతంలో వేసిన పంటకు గిట్టుబాటు ధరలేక తీవ్రంగా నష్టపోయారని అలాంటి పరిస్థితుల్లో రైతులు చెల్లించాల్సిన పంట ఇన్సూరెన్స్ చెల్లింపు గడువును ఆగస్టు 15 వరకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి కోరారు. ప్రస్తుతం రైతులు పడుతున్న బాధలను, ప్రభుత్వం రైతులకు ఆదుకోవడానికి చేపట్టాల్సిన చర్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణకు ఆయన ఆ సంఘం నాయకులతో కలిసి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా ప్రకృతి వైపరీత్యాలు, విభిన్న పరిస్థితుల కారణంగా జిల్లాలో రైతాంగం గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోందన్నారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధరలేక గతంలో ఎన్నడూ లేని విధంగా నష్టపోగా మిగతా పంటలు వేసిన రైతులు దిగుబడి లేక మద్దతు ధరలేక నష్టపోయారన్నారు. దీంతో వ్యవసాయ రుణాలు కూడా రెన్యువల్ చేయించుకోలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. అలానే అందిస్తామని హామీలిచ్చిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సాయాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు 90శాతం సబ్సిడీకి అందజేయాలని కోరారు. రైతులు పొందిన రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

108 వాహనానికి పార్కింగ్ చూపండి



108 సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ యామినీ రెడ్డి

ఓబులవారిపల్లె : జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగిన వెంటనే సంఘటనా స్థలికి వెళ్లేందుకు మండల కేంద్రంలో అనువైన ప్రదేశాన్ని కేటాయించాలని బుధవారం 108 సిబ్బంది తహసీల్దార్ యామినీ రెడ్డి, ఎంపీడీఓ మల్ రెడ్డిలను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యల్లాయపల్లె సచివాలయ ప్రాంగణంలో 108 వాహనాన్ని ఉంచుతున్నామన్నారు. మండల కేంద్రంలో 108 వాహనాన్ని నిలిపేందుకు అనుకూలమైన ప్రదేశాన్ని చూపించాలని కోరారు. దీంతో ప్రమాద ప్రాంతానికి త్వరగా చేరుకునేందుకు వీలుంటుందని అన్నారు. స్పందించిన తహసీల్దార్, ఎంపీడీఓ 108 వాహనానికి అనువైన ప్రదేశం కోసం పరిశీలించి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో 108 సిబ్బంది సుధాకర్, తేజ, నరసింహులు పాల్గొన్నారు.

ఏ ఎన్నికైనా విజయం వైఎస్సార్‌సీపీదే



వైస్ ఎంపీపీని సన్మానిస్తున్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు

సంబేపల్లె : రాబోయే అన్ని ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌సీపీదే గెలుపని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్దన్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం మండల ఉపాధ్యక్షుడి ఎన్నికల్లో గెలుపొందిన శ్రీధర్‌రెడ్డిని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విష్ణువర్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజులలో ఎప్పుడు ఏ ఎన్నికలు జరిగినా వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తల అండతో వైఎస్‌ఆర్‌సీపీ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పిలుపుతో నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న అధికారులు

సుండుపల్లె : మండల పరిధిలోని కేజీబీవీ బాలికల పాఠశాలను బుధవారం మండల ప్రత్యేకాధికారి సురేష్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులకు పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ప్రత్యేకాధికారి, తహసీల్దార్ మహబూబ్‌చాంద్ కలిసి పాఠశాలలోని స్టోర్ రూమ్, డార్మిటరీ, టాయిలెట్స్, బాత్‌రూమ్స్, వంటగది, భోజనశాల, కిచెన్ గార్డెన్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శివశృతి పాఠశాల నెలకొన్న నీటి సమస్యను అధికారుల దృష్టి తీసుకెళ్లారు. రోజూ ఒక ట్యాంకర్ నీరు అవసరముందని సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల బీసీ వెల్ఫేర్ అధికారి నాగేంద్రరాజు, ఎంఈఓ–2 రవీంద్రనాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

